## ఈత కోసం వెళ్లిన ఇద్దరు బాలురు మృతి

**వెల్దుర్తి, మే 15, ప్రభాతవార్త:**
ఈత కొట్టడానికని వెళ్లిన ఇద్దరుబాలురు ప్రమాదవశాత్తు క్వారీగుంతలో మునిగి మృతిచెందిన సంఘటన మాసాయిపేటమండలంలోని హకీంపేటశివారులో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం, మాసాయిపేట గ్రామానికి చెందిన జల నందకిషోర్ (15), భాను (15) ఈతకొట్టేందుకు హకీంపేట గ్రామశివారులోని క్వారీగుంతవద్దకు వెళ్లారు. ఈతకొట్టేక్రమంలో లోతైనగుంత ఉండడంతో గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలానికిచేరుకొని గాలింపుచర్యలుచేపట్టారు. మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టంనిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలురు మృతిచెందడంతో మాసాయిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులరోదనలు పలువురిని కంటతడిపెట్టించాయి. తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ట్రాక్టర్ బైక్ ఢీ - ఒకని మృతి

**వెల్దుర్తి, మే 15, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలో గురువారం రాత్రి ట్రాక్టర్ బైక్ ఢీ కొనగా, రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల, కుటుంబీకుల కథనం ప్రకారం.. ఎలుకపల్లి గ్రామానికి చెందిన అల్లూరి పవన్‌కళ్యాణ్ (25) ఐకెపి వద్ద ధాన్యం కొనుగోలుకి వెళ్లి తూకం వేసి, తిరిగి స్వగ్రామైన ఎలుకపల్లికి వెళ్తున్న క్రమంలో తిరుమల వైన్స్ ముందు ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో పవన్‌కళ్యాణ్ విగతజీవి కావడంతో కంటతడిపెట్టారు. మృతుని భార్య రేఖ, ఘటనాస్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న తూప్రాన్ సిఐ వెంకటరాజుగౌడ్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. శుక్రవారం మృతుని భార్య రేఖ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## అకాల వర్షాలతో ధాన్యానికి నష్టం
-అదనపు కలెక్టర్ పాండు


రైస్ మిల్లును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పాండు దృశ్యం

**చౌటకూరు, మే 15, ప్రభాతవార్త:**
అకాలవర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని జిల్లా అదనపు కలెక్టర్ పాండు అన్నారు. మండలపరిధిలోని కోడూర్‌లోని ఎస్సీబెం, జోగిపేటలోని రామకృష్ణ రైస్ మిల్లులను గురువారం అదనపు కలెక్టర్ పాండు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అకాలవర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ధాన్యాన్ని వెంటవెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. అవసరమైతే ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. సామర్థ్యంమేరకు పూర్తిస్థాయిలో మిల్లింగ్ చేయాలన్నారు. ధాన్యం నిల్వ చేసేందుకు సమీపంలోని రైతు వేదికలను వినియోగించుకోవాలని మిల్లర్లకు సూచించారు. మిల్లులవద్ద ధాన్యంబస్తాలను అన్‌లోన్ చేసుకునే విషయంలో జాప్యానికి తావు లేకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని అధికారులను అదనపు కలెక్టర్ పాండు ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట పుల్‌కల్ తహసీల్దార్ కృష్ణ ఉన్నారు.

## రంగనాయకసాగర్‌ను సందర్శించిన అబుదాబి, కువైట్ ప్రతినిధులు

**చిన్నకోడూరు, మే 15, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని చంద్లాపూర్ శివారులోగల రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను శుక్రవారం అబుదాబి, కువైట్ ప్రతినిధులు సందర్శించారు. ఈసందర్భంగా రంగనాయకసాగర్ రిజర్వాయర్ అండర్‌గ్రౌండ్ నిర్మాణ పనులను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెగా ఇంజనీరింగ్ కంపెనీకి అబుదాబిలో ప్రాజెక్టునిర్మాణానికి అక్కడిప్రభుత్వం అనుమతులు మంజూరుచేసింది. ఇండియాలోని తెలంగాణ రాష్ట్రంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయకసాగర్‌ను సందర్శించి రిజర్వాయర్ వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అబుదాబి అధికార ప్రతినిధులు డాక్టర్ అబ్దుల్లా హుమైద్, అబ్దెల్ రహ్మాన్, అహ్మాద్ యూసిఫ్, డాక్టర్ అహ్మద్ అబ్దేల్మొటి, సిద్దిపేట ఎసిపి రవీందర్, రూరల్ సిఐ విద్యాసాగర్, ఎస్ఐ చంద్రమోహన్, మెగా కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఉపాధ్యాయులు

**చిలిపిచెడ్, మే 15, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని ఉపాధ్యాయులకు తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ నుండి విశిష్ట పురస్కారం లభించింది. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల సోమక్కపేట్ నుండి డి.యాదగౌడ్, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల చిట్కుల్ నజ్మా, కెజిబివి చిట్కుల్ నుండి మాధవి, మండల ప్రజాపరిషత్ పాఠశాల చిలిపిచెడ్ నుండి ఆంజనేయులు వీరికి విధుల్లో నిబద్ధతతో ఉంటూ, 90శాతానికి పైగా హాజరును నమోదుచేసినందుకుగాను ప్రభుత్వం ప్రశంసాపత్రం అందజేసింది. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ చేతుల మీదుగా ఈ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. విధులకు క్రమంతప్పకుండా హాజరవుతూ విద్యావ్యవస్థలో క్రమశిక్షణకు నిదర్శనంగా ఉపాధ్యాయులు నిలిచారు. పాఠశాల విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచి, విద్యానాణ్యతను పెంచడంలో కీలకపాత్ర పోషించినందుకు ఈ గుర్తింపు వీరికి లభించింది. ఈసందర్భంగా మండల విద్యాధికారి విటల్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సహదేవ్, చిట్కుల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, కెజిబివి పాఠశాల ఎస్ఓ అంజలి, గ్రామపెద్దలు, చిట్కుల్ ఉపసర్పంచ్ అఖిల్, ఎంపిఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అడ్మిషన్లు లేకుంటే ప్రై 'వేటు' టీచర్లకు తప్పదు
-ప్రైవేటు పాఠశాల టీచర్లకు టార్గెట్ల తిప్పలు

**నారాయణఖేడ్, మే 15, ప్రభాతవార్త:**
ప్రైవేటు పాఠశాలల్లో టీచర్లకు అడ్మిషన్ల అగచాట్లు తప్పడంలేదు. అసలే మండే ఎండలకు తోడు ఉక్కపోతతో అల్లాడుతుంటే అడ్మిషన్ల టార్గెట్లు వారిలో మరింతవేడి పుట్టిస్తున్నాయి. కొన్నిప్రైవేట్ యాజమాన్యాలు టార్గెట్లుపెట్టి వీధిలో పరిగెత్తిస్తుంటే, మరికొన్ని పాఠశాలల యాజమాన్యాలు బస్సుల్లో టీచర్లను పల్లెలకు తీసుకెళ్లి కరపత్రాల ద్వారా ప్రచారం చేయడంతోపాటు అడ్మిషన్లు చేయించేలా ఒత్తిళ్లు పెడుతున్నారు. లేకపోతే ఈయేడాది జూన్‌లో ప్రారంభమయ్యే కొత్త విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయ పోస్టులు ఉండవని భయపెట్టిస్తున్నారు. సాధారణంగా వేసవిసెలవుల్లో విహారయాత్రలకు కుటుంబ సభ్యులతో వెళ్లి ఎంజాయ్ చేయాల్సిన సమయంలో పల్లెలు, పట్టణాల్లో తిరగాల్సి వస్తుందని ప్రైవేట్ టీచర్లు, జూనియర్ లెక్చరర్స్ వాపోతున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో అన్నిమండలాల్లో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు పుట్టగొడుగుల్లాగా వెలిశాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలో వందలాది ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు ఉపాధ్యాయులపై టార్గెట్‌విధిస్తూ ఒక్కో ఉపాధ్యాయునికి 5 నుండి 10 అడ్మిషన్లు చేయించాలని తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారు. అదేవిధంగా కళాశాలల్లో సైతం సూర్యోదయానికి సలాం కొట్టి ఉదయమే కరపత్రాలు పట్టుకొని పల్లెల్లోకి ప్రవేశాలకోసం పరిగెడుతున్నారు. అడ్మిషన్లు తీసుకురాకుంటే వచ్చే విద్యాసంవత్సరంలో వేటు తప్పదని పలు యాజమాన్యాలు అల్టిమేటం జారీచేస్తున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు అయితే ఇప్పటివరకు ప్రైవేట్ ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వక ఇబ్బంది పెడుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. పట్టణంలో ఓ పాఠశాలలో ఆరునెలల వరకు ఉపాధ్యాయులకు జీతాలివ్వక ఇబ్బందిపెడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా, నిమ్మకునీరెత్తినట్లు చేతులెత్తేసిన వైనం గమనార్హం. ఇదిలా ఉండగా ఓపక్క పేదరికం, మరోపక్క నిరుద్యోగంతో చాలామంది యువతీయువకులు ప్రైవేటు పాఠశాలలో ఎంతకయితే అంతకు చేరి, విద్యాబోధనలు చేస్తున్నారు. అయినప్పటికీ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు సైతం పడుతూ కాలాన్ని వెళ్ళదీస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టానుసారం జీతాలు ఇస్తూ, నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇదొక ఎత్తు అయితే, మరోపక్క వేసవి సెలవులలో ఆనందంగా గడుపుదామనుకుంటే వచ్చే విద్యాసంవత్సరం ఉద్యోగం చేయాలనుకుంటే తప్పనిసరిగా అడ్మిషన్లు తీసుకురావాల్సిందేనని ఒత్తిడికి గురిచేస్తున్నారు. ఉపాధ్యాయులను వీధుల్లోకి పంపి అడ్మిషన్లకోసం ఇబ్బందులు పెట్టడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతుంది. ప్రైవేట్ పాఠశాలల మధ్య పోటీతత్వం పెరగడంతో విద్యార్థుల సంఖ్యలు పెంచుకునేందుకు ఎవరికివారు తాపత్రయం పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు న్యాయంచేయాలని ఈ సందర్భంగా పలువురు ప్రైవేటు ఉద్యోగస్థులు, టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పిహెచ్‌సిలో వైద్యురాలి వీరంగం

**సిర్గాపూర్, మే 15, ప్రభాతవార్త:**
విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో పాటు రోగుల పట్ల దురుసుగా ప్రవరిస్తూ వార్తల్లోకి ఎక్కిన సిర్గాపూర్ పిహెచ్‌సి డాక్టర్ జి.ప్రతిభను ప్రభుత్వం సరెండర్‌చేసింది. ఆసుపత్రి పరిధిలోని గ్రామాల ప్రజల ఫిర్యాదు మేరకు నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి ఆదేశాలతో విచారణ చేసిన డిఎంఅండ్‌హెచ్‌ఓ వసంత్‌రావు డాక్టర్ ప్రతిభను సరెండర్‌చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సరెండర్ ఉత్తర్వులు అందుకున్న డాక్టర్ ప్రతిభ సహనం కోల్పోయి డిఎంఅండ్‌హెచ్‌ఓను అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు ఆసుపత్రి సిబ్బందిపై వీరంగం సృష్టించారు. పిహెచ్‌సిలో డాక్టర్ చేస్తున్న వీరంగంలో ఆసుపత్రిలో ఉద్రిక్త పరిస్థితిని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డాక్టర్‌ను శాంతింపచేశారు. డాక్టర్ ప్రతిభను సరెండర్ చేయడం పట్ల రోగులు హర్షం వ్యక్తంచేస్తూ కొత్త డాక్టర్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

# రూ.650కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

-ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
-వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు రావాలి: మంత్రి రాజనర్సింహ

**కొండాపూర్, మే 15, ప్రభాతవార్త:**
రాష్ట్ర పరిశ్రమలు, ఐటిశాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్యశాఖామంత్రి దామోదర్ రాజ నర్సింహతో కలిసి సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తోగారపల్లి గ్రామ శివారులో కెజెఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్-IIకు శుక్రవారం శంకుస్థాపనచేశారు. రూ.650కోట్ల పెట్టుబడితో 44ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతున్న ఈపరిశ్రమద్వారా ప్రత్యక్షంగా 1500మందికి, పరోక్షంగా సుమారు 3వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటిశాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంతప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనద్వారా స్థానికయువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుసాగుతోందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భారీస్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌లు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. తెలంగాణ ఈరంగంలో ప్రత్యేకగుర్తింపు సాధించేదిశగా అడుగులు వేస్తోందన్నారు. భవిష్యత్తులో ఈప్రాంతం అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్‌గా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. తెలంగాణ దేశంలో అత్యధిక వరి ఉత్పత్తిచేసే రాష్ట్రంగా నిలిచిందని, పాలు, పండ్లు, కూరగాయలు, పసుపు వంటి ఉత్పత్తులలో కూడా రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు విలువను పెంచే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటవడం రైతులకు, యువతకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తోందన్నారు. వైద్య ఆరోగ్యశాఖామంత్రి దామోదర రాజ నర్సింహ మాట్లాడుతూ, ఉమ్మడిరాష్ట్రంలోనే అతి పెద్దపారిశ్రామికవాడగా పటాన్‌చెరు గుర్తింపు పొందిందన్నారు. అదేతరహాలో వెనుకబడిన ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేవిధంగా పారిశ్రామికవేత్తలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలస్థాపనకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో ఇంతపెద్దస్థాయిలో పరిశ్రమ ఏర్పాటుచేస్తున్న కెజెఎస్ ఇండియా యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించేదిశగా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్‌సభ్యులు రఘునందన్‌రావు, సురేష్‌షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, టిజిఐఐసి చైర్మన్లు నిర్మలాజగ్గారెడ్డి, గిరిధర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పి పరితోష్‌పంకజ్, టిజిఐఐసి ఎండి శశాంక్, మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు. ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, నరసింహారెడ్డి, రామ్‌రెడ్డి, సర్పంచులు దివ్యవాణి, లక్ష్మి కంపెనీ చైర్మన్ గిరీష్‌జైన్, ఎండి సిపి రాంకా, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రుల దృశ్యం

**టిజిఐఐసి కార్యాలయం ప్రారంభోత్సవం...**
**హాజరైన రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ...**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 15, ప్రభాతవార్త:**
సంగారెడ్డి పట్టణంలోని ఆదర్శ్‌నగర్‌లో టిజిఐఐసి నూతన కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగాజరిగింది. రాష్ట్రమంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహలు ముఖ్యఅతిథులుగా హాజరై, కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా నూతన కార్యాలయంలో మంత్రులు, ఇతరప్రజాప్రతినిధులు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం రాష్ట్ర ఛైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిని నూతన కార్యాలయంలోని కుర్చీలో కూర్చోబెట్టారు. మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, ఎంపి సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, టిజిఐఐసి అధికారులు ఈసందర్భంగా నిర్మలాజగ్గారెడ్డికి అభినందనలు తెలిపారు.

# దేశ హితం కోసం ప్రధాని పని చేస్తున్నారు

-మెదక్ ఎంపి రఘునందన్‌రావు


విలేకరులతో మాట్లాడుతున్న మెదక్ ఎంపి రఘునందన్‌రావు

**సిద్దిపేట అర్బన్, మే 15, ప్రభాతవార్త:**
దేశహితం కోసం జనహితం కోసం ప్రధాని మోడీ నిరంతరం పనిచేస్తున్నారని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్కృతిక వేసవిశిక్షణశిబిరం ముగింపు ఉత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానిమోడీ ఏది మాట్లాడినా, కాంగ్రెస్‌నాయకులకు వ్యతిరేకించడం అలవాటుగా మారిందని మండిపడ్డారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, మన్‌మోహన్ సింగ్‌లు బంగారం కొనవద్దని చెప్పినప్పుడు లేవని నోర్లు ఇప్పుడు ప్రధానిమోడీ మాట్లాడితే ఎందుకు లేస్తున్నాయని ప్రశ్నించారు. దేశహితం కోసం ప్రధాని ముందుచూపుతో ప్రజలను పొదుపు పాటించాలని చెప్పడం తప్పెలా అవుతుందని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ప్రధానిమోడీ మాటలను సామాన్య ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. ప్రధాని పిలుపు మేరకు తాను కూడా ఇక నుంచి ఎలక్ట్రిక్ వాహనం వినియోగిస్తానని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఎలక్ట్రిక్‌వాహనాలు, సోలార్‌కరెంటుపై దృష్టిపెట్టాలన్నారు. సోలార్‌పై కేంద్రప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని వినియోగించుకోవాలన్నారు. రెండు మెగావాట్ల సోలార్‌ప్లేట్లు అమర్చుకుంటే రూ.78వేల సబ్సిడీ వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్, పార్టీనాయకులు బాసంగారి వెంకట్, కాసానగొట్టు సంతోష్, తుంగ కనకయ్య, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ గోనె మార్కండేయులు పాల్గొన్నారు.

## వచ్చే ఖరీఫ్‌లో సన్నవడ్లను పండించాలి
-జిల్లా కలెక్టర్ కె.హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
మిల్లుల్లో దిగుమతిలో జాప్యం కాకుండా ఎక్కువ మంది హమాలీలను సమకూర్చుకుని షిఫ్ట్‌లావారీగా దిగుమతి వేగవంతంచేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. శుక్రవారం దుబ్బాక మండలం హబ్సీపూర్‌లోని లలితపరమేశ్వర ఇండస్ట్రీస్, అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతెగ్రామంలోని భారతి ఇండస్ట్రీస్, మంజునాథ ఇండస్ట్రీస్, దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలోని స్వాతి ఇండస్ట్రీస్, రాయపోల్ మండల పరిధిలోని వడ్డేపల్లి శివసాయిబాలాజీ ఇండస్ట్రీస్‌లలో ధాన్యం దిగుమతిప్రక్రియను కలెక్టర్ హైమావతి జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిణి జి.తనూజతో కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ, జిల్లాలో వరి కొనుగోలు సజావుగా జరగాలంటే లారీలు, ట్రాక్టర్‌లలో మిల్లులకు పంపించిన ధాన్యం దిగుమతిలో జాప్యంచేయకుండా వెనువెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లర్ యజమానులను ఆదేశించారు. వచ్చే ఖరీఫ్‌లో సన్నవడ్లను పండించాలని, సన్నవడ్లకు బోనస్‌తోపాటు జిల్లాలో పండించిన బియ్యం జిల్లాలోని ప్రజలకు సరిపోతాయన్నారు. కలెక్టర్‌వెంట వివిధశాఖల అధికారులున్నారు.


ధాన్యం దిగుమతిని ప్రక్రియను తనిఖీచేస్తున్న కలెక్టర్ హైమావతి

## చీలపల్లిలో దొంగల బీభత్సం
-113 తులాల బంగారం, 2.5 కిలోల వెండి అపహరణ

**పెద్దశంకరంపేట, మే 15, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలంలోని చీలపల్లి గ్రామంలో గురువారం అర్థరాత్రి జరిగిన భారీచోరీ ఘటన స్థానికంగా తీవ్రకలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు 113తులాల బంగారం, 2.5కిలోల వెండిని అపహరించడం మండలంలో చర్చనీయాంశమైంది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళ్తే, మండలపరిధిలోని చీలపల్లిగ్రామంలో రాత్రివేళ ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు తాళంవేసి ఉన్న ఐదు ఇళ్లలో తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. మూడు ఇళ్లలో ఎలాంటివస్తువులు పోలేదని పోలీసులు తెలిపారు. మిగతా రెండు ఇళ్లలోనే 113తులాల బంగారం, 2.5కిలోల వెండిని దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన రాయిని రాములు కుటుంబసభ్యులతో కలిసి నూతనపాఠశాల ప్రారంభోత్సవానికి కామారెడ్డిజిల్లా బాన్సువాడ వెళ్లారు. ఈ క్రమంలో ఇంటికి తాళం వేసి ఉండటంతో దొంగలు ఇదే అదునుగా భావించి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. ఉదయమే రాయిని రాములు ఇంటికి చేరుకున్న పనిమనిషి పరిస్థితిని గమనించి, వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, కుటుంబ సభ్యులు పోలీసులకు విషయం తెలిపారు. తక్షణమే మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సిఐ రేణుకారెడ్డి పెద్దశంకరంపేట, అల్లాదుర్గం ఎస్సైలు ప్రవీణ్‌రెడ్డి, శంకర్‌లు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ బృందాలతో ఆధారాలు సేకరించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**సదాశివపేట, మే 15, ప్రభాతవార్త:**
సంగారెడ్డిజిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఈరోజు ఉదయం 10.40 గంటలకు పెద్దాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా కొనుగోలుకేంద్రంలో నిర్వహణవిధానాన్ని పరిశీలించిన కలెక్టర్, ట్యాబ్ ఎంట్రీలు, రైతుల ధాన్యంకొనుగోలు వివరాలకు సంబంధించిన రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అలాగే కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం 47మంది రైతులనుండి 1330క్వింటాళ్ల వరి కొనుగోలుచేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అందులో 1114క్వింటాళ్ల ధాన్యాన్ని ఇప్పటికే మిల్లులకు తరలించినట్లు తెలిపారు. మిగిలిన 36మంది రైతులకు సంబంధించిన చెల్లింపులు ప్రస్తుతం పేమెంట్‌దశలో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

## చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**ములుగు, మే 15, ప్రభాతవార్త:**
ములుగు మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామంలో ఈనెల 4వ తేదీన జరిగిన చోరీకేసును పోలీసులు ఛేదించారు. గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నతిమ్మాపూర్ గ్రామానికిచెందిన శాలివాహిని నర్సింలు వంటిమామిడి వద్ద శ్రీరామ బ్యాంగిల్ షాపును నడిపిస్తున్నాడు. తునికిబొల్లారం గ్రామంలో బంధువుల వివాహానికి వెళ్లే సమయంలో అతని కూతురు బంగారు ఆభరణాలను తండ్రి నర్సింలుకు ఇవ్వగా, బీరువాలో భద్రపర్చాడు. అనంతరం పనిమీద ఇంటికి తాళంవేసి హైద్రాబాద్‌కు వెళ్లాడు. కొంతసేపటి తర్వాత అతని కుమారుడు వేణు ఫోన్‌చేసి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని, బీరువా తాళాలు ధ్వంసంచేసినట్లు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఇంటికి చేరుకొని పరిశీలించగా, తన కుమార్తెకు సంబంధించిన బంగారు ఆభరణాలు, తన భార్యకు చెందిన బంగారం, వెండివస్తువులతో పాటు రూ.2 లక్షల నగదు కనిపించలేదు. బాధితుడు ములుగు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, మొత్తం 24తులాల బంగారం, 44తులాల వెండి, నగదు దొంగతనానికి గురైనట్లు కేసు నమోదు చేసి గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు ఆధ్వర్యంలో ములుగు ఎస్ఐ రఘుపతి, పోలీస్ సిబ్బంది, సిసిఎస్ సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టారు. శామీర్‌పేట మండలం పెద్దమ్మ కాలనీకి చెందిన మడిగెల బాలచందర్, దమ్మాయిగూడ జవహర్‌నగర్‌కు చెందిన ఇప్పలపల్లి నరేష్, శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ గ్రామానికి చెందిన పోత్రకొండ బాలకృష్ణలు ముగ్గురు నిందితులను గుర్తించారు. ఈనెల 9వ తేదీన పోత్రకొండ బాలకృష్ణ వంటిమామిడి చెక్‌పోస్టువద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నరేష్, బాలచందర్‌లతో కలిసి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించారు. మొదటి నిందితుడు మడిగెల బాలచందర్‌ను కీసర పోలీసుల సహకారంతో కోర్టు ఆదేశాల మేరకు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించి, దొంగతనం చేసిన బంగారం, వెండి ఆభరణాలను రికవరీ చేసినట్లు తెలిపారు. రెండవ నిందితుడు నరేష్ నగదు, ఒక బైక్‌తో పరారీలో ఉన్నాడని అతని కోసం ప్రత్యేకబృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు, సిసిఎస్ సిఐ రవీందర్, ములుగు ఎస్ఐ రఘుపతి, క్లూస్ టీం ఎస్ఐ శరత్, ఐటిసెల్, సిసిఎస్ సిబ్బందిని, ములుగు పోలీస్ సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీపెరుమాళ్ అభినందించారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి
-జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**వెల్దుర్తి, మే 15, ప్రభాతవార్త:**
ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తిచేయాలని కొనుగోలు, రవాణాలలో ఎలాంటి సమస్య లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. శుక్రవారం మండలకేంద్రమైన వెల్దుర్తిలో పిఎసిఎస్ ద్వారా ఏర్పాటుచేసిన వరి కొనుగోలుకేంద్రాన్ని జిల్లాకలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేవరకు అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని ఆమె సూచించారు. ప్రతి కొనుగోలుకేంద్రాన్ని అధికారులు పర్యవేక్షించాలన్నారు. రవాణాలో ఎలాంటిసమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలుకేంద్రం వద్ద టార్పలీన్లను అందుబాటులో ఉండాలని ఆమె అన్నారు. రవాణా సమస్య ఉంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని స్పష్టంచేశారు. తగినన్ని లారీలను కొనుగోలుకేంద్రాలకు పంపాలని ఆదేశించారు. కచ్చితమైన రిజిస్టర్ ఏర్పాటుచేసి వివరాలు నమోదుచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు ప్యాడి క్లీనింగ్ పరికరాలు అందుబాటులో లేకుంటే మరొకచోటు నుండి తెప్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, పిఎసిఎస్ సిఈవో అశోక్, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు పలు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్


ప్రభుత్వ సలహాదారు విహెచ్‌ను సన్మానించిన సతీష్‌గౌడ్

## విహెచ్‌ను కలిసిన బద్దం సతీష్‌గౌడ్

**గన్‌ఫౌండ్రి, మే 15 ప్రభాతవార్త :** బిసి సంక్షేమ ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన మాజీ రాజ్యసభసభ్యులు, కాంగ్రెస్ నాయకులు వి.హనుమంత్‌రావు పదవీబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి, బొకె అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

## డిజిపిని కలిసిన ఉత్సవ సమితి ప్రతినిధులు


డిజిపి సి.వి ఆనంద్‌ను సన్మానించిన ఉత్సవ సమితి ప్రతినిధులు

**బేగంబజార్, మే 15 ప్రభాతవార్త :** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సి.వి.ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు డిజిపి కార్యాలయంలో డిజిపి సి.వి. ఆనంద్‌ను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవినూతల శశిధర్, ఉపాధ్యక్షులు గోవింద్‌రాఠి, సలహాదారులు కరోడిమల్ నర్సింగ్ పూరియ, మహిపాల్‌రెడ్డి, అలే బాస్కర్ శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు.

## కవితా సంకలనం జనగీతిక ఆవిష్కరణ


జనగీతికను ఆవిష్కరిస్తున్న ఏనుగు నరసింహారెడ్డి తదితరులు

**రవీంద్రభారతి, మే 15 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర గీతాన్ని అందించిన లోకకవి డా. అందెశ్రీని స్మరించుకుంటూ కవులు జనగీతిక పేరున అక్షరాంజలి సమర్పించడం ఎంతో సబబని రాష్ట్ర బాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ప్రశంసించారు. శుక్రవారం రవీంద్రభారతిలోని కళాభవన్‌లో తన కార్యాలయంలో 67 మంది వర్ధమాన కవులు రాసిన కవితా సంకలనం జనగీతికను నరసింహారెడ్డి ఆవిష్కరించి అభినందించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి ఏఓ డా. పి.విజయ కుమార్, జనగీతిక సంకలనం సంపాదకుడు డా. తిరునగరి శ్రీనివాస్, సినీగేయరచయిత మౌనశ్రీ మాలిక్, సినీదర్శకుడు నామల రవీంద్రసూరి, గాయకులు సుధాకర్, కవి రచయిత మిద్దె సురేష్ పాల్గొన్నారు.

## ఉత్తమ కాలనీలో దోమల నివారణపై అవగాహన



దోమల వ్యాప్తి నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పేట్‌బషీరాబాద్, మే 15, ప్రభాతవార్త:** హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీకి మన నగరం కార్యక్రమంలో ఉత్తమ కాలనీ అవార్డు లభించిన సందర్భంగా, ఆ కాలనీలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారులు దోమల నివారణకు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని సూచిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం కాలనీలో మందులు పిచికారీ చేసి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు పద్మ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్దిరాములు, గౌరవ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిడ్డి మల్లేశం, ఉపాధ్యక్షులు రాములు, జి. శ్రీనివాస్ రెడ్డి, ఆలయ చైర్మన్ టి. రాజేశ్వర్, ఆర్థిక కార్యదర్శి సిహెచ్ రాజు, బాలరాజు, శ్రీనివాస్ రెడ్డి, సుబ్బయ్యతో పాటు కాలనీ నాయకులు సంపత్, మాధవ రెడ్డి, బచ్చు జ్ఞానేశ్వర్, నరేందర్ రెడ్డి, అప్పల శేఖర్, నర్లకంటి కుమార్, ఎల్లాగౌడ్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## 20న బట్రాజ్ సర్పంచులు, కౌన్సిలర్లకు సన్మాన సభ

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** బీసీ సమాజ్ - బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గెలిచిన బట్రాజ్ సామాజిక వర్గానికి చెందిన సర్పంచులు, వార్డు మెంబర్స్, మున్సిపల్ కౌన్సిలర్‌లకు ఈ నెల 20 వ తేదీన నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అభినందన సభ నిర్వహిస్తున్నట్టు బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మీడియా సెంటర్లో అభినందన సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీసీ సామాజికవర్గంకు చెందినవారిని ఒక్కొక్కరిగా అభినందన సభలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గతంలో రజక కుమ్మరి మంగలి గంగిరెద్దుల తమ్మలి సామాజిక వర్గాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులను అభినందించి ప్రస్తుతం మే 20న భట్రాజ్ సామాజిక వర్గానికి సంబంధించిన ప్రజాప్రతినిధులకు అభినందన సభ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భవిష్యత్తులో భట్రాజు సామాజిక వర్గాల నుంచి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలకు ఆ సభ ద్వారా తీర్మానాలు చేసి పంపించినట్టు అధ్యక్షులు సంగెం సూర్యారావు తెలిపారు. ఈకార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి బట్టు విజయరాజ్, బీసీ సమాజ్ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లూరి అర్జున్, రూపేష్ బట్రాజ్ సంఘం నాయకులు నందిబట్టు నరసింహారాజు, కాంచనపల్లి రాంబాబు రాజు, ఉపేంద్ర, కృష్ణ, కమల్, సరస్వతి, సత్యనారాయణరాజు, సరికొండ వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు..



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంగెం సూర్యారావు, విజయరాజ్ తదితరులు

# హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులకు సన్మానం

## సనత్‌నగర్ బాలుడి హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష


దర్యాప్తు, ప్రాసిక్యూషన్ బృందాన్ని సన్మానిస్తున్న వీసీ సజ్జనర్

**సంజీవరెడ్డి నగర్, మే 15, ప్రభాతవార్త:** సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడేళ్ల క్రితం సంచలనం సృష్టించిన బాలుడి కిడ్నాప్, హత్య కేసులో నిందితులకు కఠినశిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి సాక్ష్యాధారాలు సమర్పించిన పోలీసు, ప్రాసిక్యూషన్ బృందాన్ని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వి.రామకృష్ణారావు, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎం.ముత్తుయాదవ్, సనత్‌నగర్ ఎస్‌హెచ్ఓ డి.అశోక్, ఎస్ఐ అబ్దుల్ హయూమ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎన్.శేఖర్‌లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఇమ్రాన్ అలీఖాన్ అలియాస్ ఫిజా ఎనిమిదేళ్ల బాలుడు అబ్దుల్‌వాహిద్‌ఖాన్‌ను కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు కోర్టు నిర్ధారించింది. ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కక్షల కారణంగా ఈ నేరానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడు తన నివాసంలోనే బాలుడిని గొంతు నులిమి హత్యచేసి, అనంతరం మృతదేహాన్ని బకెట్‌లో పెట్టి సహ నిందితుడు మహమ్మద్ రఫీక్ సహాయంతో సమీప నాలాలో పడేసినట్లు పోలీసులు వెల్లడించారు. బాలుడు కనిపించడం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించారు. కేసులో కీలకమైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించడంతో మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా, అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కమ్ ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎం. వెంకటేశ్వరరావు ప్రధాన నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ చారిత్రాత్మక తీర్పు వెలువరించారు. అదనంగా కిడ్నాప్ కేసులో యావజ్జీవ కారాగార శిక్ష సాక్ష్యాధారాల ధ్వంసం కేసులో మరో ఏడేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. రెండో నిందితుడు మహమ్మద్ రఫీక్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారైంది. ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు వేగంగా న్యాయం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్ ఈ కేసులో కీలక పాత్ర పోషించిందన్నారు. డీసీపీ క్రైమ్స్ ఎస్. చైతన్యకుమార్, ఓఎస్డీ మల్లారెడ్డి పర్యవేక్షణలో అధికారులు సమన్వయంతో పనిచేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా కృషి చేశారని కొనియాడారు.


ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న మహిళా కాంగ్రెస్ నేతలు

## పెట్రోల్, డీజిల్ ధరలపై మహిళా కాంగ్రెస్ నిరసన

**హైదరాబాద్, మే 15 ప్రభాతవార్త:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలు పెంచి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మరో భారం మోపిందని మండిపడ్డారు. శుక్రవారం అంబర్‌పేటలోని పెట్రోల్ బంక్ వద్ద మహిళా కాంగ్రెస్ నేతలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ రేట్లను మళ్లీ పెంచిన మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని అన్నారు. ఇప్పటికే నిత్యాసరాల ధరలు, గ్యాస్, వంట నూనె, విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, ఖైరతాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే విజయరెడ్డి ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెంచిన పెట్రోల్ డీజిల్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా కార్యదర్శులు లావణ్య, సోనియా, మారి, ఖైరతాబాద్ నియోజకవర్గం అధ్యక్షురాలు కమల, బ్లాక్ ప్రెసిడెంట్ శ్రీదేవి, డివిజన్ అధ్యక్షులు సంధ్యారాణి, పార్వతి, మాధవి, కవిత, సెలీనా, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడ రోడ్డు ప్రమాదంపై ఎమ్మెల్యే సీరియస్


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ

**చాంద్రాయణగుట్ట, మే 15, ప్రభాతవార్త :** బండ్లగూడ హైవే హోటల్ సమీపంలోని యూ టర్న్ వద్ద గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై చాంద్రాయణగుట్ట శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ తీవ్రంగా స్పందించారు. చాంద్రాయణగుట్ట డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.దాసు, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ వాహబ్, మజ్లిస్ నేత హఫీస్ పటేల్ తదితరులతో కలిసి శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులతో చర్చించిన తరువాత యూటర్న్‌ను మూసివేయాలని ఆదేశించారు. అనంతరం జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో మాట్లాడారు. చాంద్రాయణగుట్ట-బండ్లగూడ ప్రధాన రహదారిపై తరచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ఆయా ప్రాంతాలలో వంతెనలు నిర్మించాలని సూచించారు.

## పాతబస్తీలో పర్యటించిన ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

**చార్మినార్, మే 15 ప్రభాతవార్త :** ఎఐఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ శుక్రవారం యాకుత్ పుర నియోజకవర్గం పరిధిలోని చంచలం డివిజన్‌లో పర్యటించారు. దాదాపు తొంభై ఆరు లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపి అసదుద్దీన్ ఓవైసీ యాకుత్‌పుర శాసన సభ్యులు జాఫర్‌హుస్సేన్ మెహరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఐఎం కార్పొరేటర్లు, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

## 18న సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉచిత ప్రవేశం

**చార్మినార్, మే 15 ప్రభాతవార్త :** అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా మే 18వ తేదీన సాలార్‌జంగ్ మ్యూజియంలోకి ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నామని మ్యూజియం కీపర్ బి.ఆర్.నాయక్ తెలిపారు. 18వతేదీ సోమవారం ఉదయం 10 గంటలు నుంచి రాత్రి ఎనిమిది గంటలు వరకు సాలార్‌జంగ్ మ్యూజియం తెరిచి ఉంటుందని ఆయన తెలియజేశారు.

## అక్క పెళ్లికి చేసిన అప్పు తీర్చలేక తమ్ముడు ఆత్మహత్య

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** అక్క పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈవిషాదకర సంఘటన బాగ్ అంబర్‌పేట్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అరవింద్, సంధ్య దంపతులకు కూతురు, కొడుకు శరత్‌కుమార్(23) ఉన్నారు. రెండేళ్ల క్రితం అప్పుచేసి కూతురు పెళ్లిచేయగా, పూర్తిగా మద్యానికి బానిసైన అరవింద్ ఏ పని చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న శరత్ కుమార్ తల్లి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించడం చూసి తట్టుకోలేక, అప్పు తీర్చే మార్గం లేక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. శరత్ కుమార్ మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

### ఆర్థిక ఇబ్బందులతో మరో యువకుడు...

**పేట్‌బషీరాబాద్, మే 15, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ పరిధిలోని ఎం.ఎన్.రెడ్డినగర్‌లో ఓ యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వాసంశెట్టి నాగజ్యోతి ఫిర్యాదు మేరకు ఆమె భర్త వాసంశెట్టి రవీంద్ర(30), వృత్తిరీత్యా మేస్త్రీ, ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు మద్యం తాగడం, బెట్టింగ్ అలవాట్ల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ, కొంతకాలంగా పనికి వెళ్లకుండా మానసికంగా బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై పెట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పోక్సో బాధితురాలి వివరాల ప్రచారంపై కేసు నమోదు

**పేట్‌బషీరాబాద్, మే 15, ప్రభాతవార్త :** సైబరాబాద్ పరిధిలో పోక్సో కేసులో బాధిత బాలికకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ఆమె తల్లిదండ్రుల వివరాలను సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో జువెనైల్ జస్టిస్ చట్టం, బీఎన్ఎస్, పోక్సో చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల ద్వారా ఈ సమాచారాన్ని ప్రసారం చేస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాధితురాలి వ్యక్తిగత వివరాలు బహిర్గతం చేయడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలు బాధిత కుటుంబానికి తీవ్ర మానసిక వేదన కలిగిస్తాయని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇటువంటి పోస్టులు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

**చార్మినార్, మే 15 ప్రభాతవార్త :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వ సిటీ కళాశాలలో గ్రంథాలయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన మాట్లాడుతూ వంద సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సిటీ కళాశాల గ్రంథాలయం వేలాది మంది అధ్యాపకులు, విద్యార్థుల జ్ఞాన దాహాన్ని తీరుస్తున్నదని అతి పురాతన విజ్ఞాన నిధి అని కొనియాడారు. గ్రంథాలయం సహకారంతో డిగ్రీ, పిజీ విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి. సెంట్రల్ యూనివర్సిటీతో పాటు విదేశీ విద్యా సంస్థలలో సీట్లను సాధిస్తున్నారని ఆమె తెలియజేశారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సిటీ కళాశాలలో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని ఆమె తెలిపారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్.ప్రసాద్, గణిత శాస్త్రంలో విశేష పరిశోధన చేస్తున్న డాక్టర్.శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన గ్రంథాలయాధికారి డాక్టర్ రవికుమార్ చేగోని, కళాశాల దోస్త్ కన్వీనర్ ప్రొ. శంకర్‌కుమార్, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగధిపతి డా. మల్లిఖార్జున్‌ను కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన సత్కరించారు. ఐక్యూయేసి కన్వీనర్ ప్రొఫెసర్ జె.నీరజ సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్ రాజేందర్ సింగ్, ప్రొఫెసర్ బాల భాస్కర్, ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్‌తో పాటు కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన

# నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యా వారోత్సవాలు

**చిక్కడపల్లి, మే 15 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అశోక్‌నగర్ నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యా వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి పి.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వారోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాల విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1138 పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇప్పటికే జారీ అయ్యాయని చెప్పారు. భారతదేశ చరిత్రలో పాఠశాల స్థాయిలో ఇంత భారీ సంఖ్యలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని అభివర్ణించారు. విద్యార్థుల్లో రీడింగ్ స్కిల్స్, రైటింగ్ స్కిల్స్ పెంపొందించడంతో పాటు సమాజంపై అవగాహన కల్పించడంలో గ్రంథాలయాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థుల్లో విజ్ఞాన సాధన, పఠన సంస్కృతి మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, హైదరాబాద్ విద్యాశాఖ అధికారి రోహిణి పాల్గొన్నారు. గ్రంథాలయాల ఏర్పాటు నిర్ణయం వెనుక రాష్ట్ర గ్రంథాలయ సంస్థ, వివిధ జిల్లాల గ్రంథాలయ చైర్మన్లు, గ్రంథాలయ ఉద్యమ కార్యకర్తలు, పుస్తక ప్రియులు విశేష కృషి చేశారని వక్తలు కొనియాడారు. లైబ్రరీస్ డైరెక్టర్ శ్రీహరి, డిప్యూటీ డైరెక్టర్ హరిశంకర్, అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహులు, గ్రంథాలయ ఉద్యోగులు చేసిన సేవలను సభలో ప్రశంసించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వసలహాదారు కేశవరావు, కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, తదితరులు


కల్లు కాంపౌండ్ సమీపంలోని రోడ్డుపై పొంగుతున్న మ్యాన్ హోల్

## ప్రకాశంనగర్‌లో పొంగుతున్న మ్యాన్‌హోల్స్

### పట్టించుకోని వాటర్‌వర్క్స్, సీవరేజ్ అధికారులు

**బేగంపేట మే 15, ప్రభాతవార్త :** ప్రకాశం నగర్‌లో వాటర్‌వర్క్స్, సీవరేజ్ కార్యాలయం పక్కన, వెనుక వైపు ఉన్న బస్తీల్లో డ్రైనేజీలు యదేశ్చగా పొంగిపొర్లుతూ స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అయినా సంబంధిత శాఖ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొన్ని రోజులుగా డ్రైనేజీలు పొంగి పొర్లుతూ స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా పట్టించుకోకపోవడంతో స్థానికులు కమ్యూనిటీ పోలీసు గ్రూపు బేగంపేటలో పోస్ట్ చేసారు. డ్రైనేజీలు పొంగుతుండటంతో వ్యర్థాలు రోడ్లపైన నిల్చి ఉంటున్నాయని, తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందంటూ పోస్ట్ చేసారు. డివిజన్ పరిధిలోని ప్రకాశంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇదే విధమైన పరిస్థితి ఉందని, డివిజన్ పరిధిలోని భగవంతాపూర్ ప్రధాన రోడ్డుపైనా డ్రైనేజీ నిత్యం ప్రవహిస్తూ వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తుందని వారు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ప్రకాశంనగర్, వికార్‌నగర్, ఎన్‌బిటీనగర్ వాసులు కోరుతున్నారు.

## జనగణనకు ప్రజలు సహకరించాలి : రామకృష్ణారెడ్డి.

**నార్సింగి, మే 15 ప్రభాతవార్త :** జనగణనకు ఇళ్లకు వచ్చే ఎమ్యూనరేటర్లకు ప్రజలు సహకరించాలని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మణికొండలోని తన ఇంటికి వచ్చిన ఎంఇఓ నిరంజన్, ఎమ్యూనరేటర్లకు కుటుంబ సభ్యుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధికి జనగణన ఉపయోగకరంగా మారుతుందన్నారు. ఈ జనగణన వలన ప్రభుత్వాలకు తగిన డేటా వస్తుందని, దీన్ని ఆధారంగా చేసుకొని అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్యూనరేటర్లు రజని, లక్ష్మీ, ఇమ్రాన్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యా వారోత్సవాలు

**నార్సింగి, మే 15 ప్రభాతవార్త :** పుస్తక పఠనం విద్యార్థి సమగ్ర వికాసానికి ఉపకరిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ దినంను ప్రత్యేకంగా జరుపుకున్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గ్రంథాలయంకు వెళ్లే అలవాటును దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. చదువులతో పాటు సామాజిక అంశాలు, క్రమశిక్షణ, గౌరవభావం వంటి మంచి లక్షణాలు గ్రంథ పఠనం ద్వారా అబ్బుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ నిరంజన్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్, మాజీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీరాములు, నరేష్, ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్, సావిత్రి, ప్రభావతి, హింద్రా, గంగాధర్, లక్ష్మయ్య, శివగంగ తదితరులు పాల్గొన్నారు.

## చిక్కా దేవదాసుకు స్థితప్రజ్ఞ బిరుదు ప్రదానం

**చిక్కడపల్లి, మే 15(ప్రభాతవార్త):** చేనేత సామాజిక ఉద్యమ నాయకుడు ఆధ్యాత్మికవేత్త యోగా గురువు ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ చిక్కా దేవదాసు అని లంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళావెంకటదీక్షితులు కళావేదికలో కళానిలయం సాంస్కృతిక సేవాసంస్థ, ఓంకార సత్సంగం ఆధ్యాత్మిక సంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిక్కా దేవదాస్ కు స్థితప్రజ్ఞ బిరుదును ప్రదానం చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, విశ్రాంత పోలీస్‌ఉన్నతాధికారి సుంకరి సత్యనారాయణ, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ టి.గౌరీ శంకర్ హాజరై పాల్గొని చిక్కా దేవదాసుకు బిరుదు ప్రదానం చేశారు. చిక్కా దేవదాసు జన్మదినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న కొత్తోజు నాగ చారి, పోసాల సరస్వతి, హనుమాండ్ల శ్రీకాంత్, చిక్కా దేవదాసు 2026 విశిష్ట ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సురేందర్, పుష్పలత పాల్గొన్నారు.

### బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను సత్కారం

**చిక్కడపల్లి, మే 15 (ప్రభాతవార్త) :** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్‌గా బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్‌లు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు, చిక్కడపల్లికి చెందిన బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నేత నైషధం సత్యనారాయణ మూర్తి శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ను సత్కరించారు. ఈ సందర్భంగా నైషధం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాడిన పరిషద్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమాజానికి న్యాయం జరగాలని ఆకాంక్షించారు.

## ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ ఎంతో పురాతనమైనది

### సినీ రచయిత శ్రీరామ్ చౌదరి

**చిక్కడపల్లి, మే 15 (ప్రభాతవార్త) :** ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ ఎంతో పురాతనమైనదని సినీ రచయిత శ్రీరామ్ చౌదరి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం సందర్భంగా కుటుంబం అవార్డు ప్రదానం, కవి సమ్మేళనం, సాంస్కృతిక ప్రదర్శనలు ఘనంగా జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన ఈకార్యక్రమంలో అతిథులు మాట్లాడారు. వాకర్స్ క్లబ్ జిల్లా 301 గవర్నర్ డాక్టర్ బి.గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబం అనేది అతి ముఖ్యమైనది. కుటుంబానికి ఎంతో ప్రాధాన్యత కలిగిఉన్నదని, ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న మురళీ మోహన్ రాజును అభినందించారు. అనంతరం కుటుంబం అవార్డుగ్రహీతలు దుబ్బా భాస్కర్‌రావు, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ ఎమ్.మధుసూదన్ రావు, లిక్కి అనురుద్రా రెడ్డి, కోకిల సుజాత, ఆలియా భాను, మంజుల కుటుంబ సమేతంగా అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సేవారత్న వడ్లకొండ వెంకట్రావు లయన్ నిర్మలా ప్రభాకర్, డాక్టర్ రాధ కుసుమ, కె.మురళీమోహన్ రాజు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, మే 15 ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఏ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ఫీల్డ్ స్థాయి పనితీరును మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సాట్ ద్వారా ఇంటింటికీ అనుసంధానం పూర్తి చేసి, మిగిలిన గ్యాప్‌లను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. గుర్తించిన భవన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వీపర్ల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కువకాలం గైర్హాజరయ్యే సిబ్బందికి బదులుగా ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న పనులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, పెండింగ్ సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని, ప్రతి విభాగం పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంతకు ముందు ఆయా ప్రాంతాల్లో కమీషనర్ పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు.

## ధనాసిరిలో సోలార్ కరెంట్ లైన్‌కు వినతి

**-జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి**



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్న ధనసిరి గ్రామస్థులు

**మొగుడంపల్లి, మే 15, ప్రభాతవార్త:**

తమండల పరిధిలోని ధనాసిరి గ్రామంలో 11కేవీ సోలార్ కరెంట్ లైన్ స్థంభాల ఏర్పాటు పనులను నిలిపివేయాలని గ్రామస్థులు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంల నడిబొడ్డు నుంచి విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేస్తున్నారని, భవిష్యత్తులో ప్రమాదాలు తలెత్తే అవకాశాలు ఉంటాయని భయాందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 11కెవి లైన్‌ను గ్రామం మధ్యలో నుంచి కాకుండా గ్రామ శివారు గుంగా ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన మహ్మద్ యునూస్ గ్రామస్థులతో కలిసి కలెక్టర్‌కు వినతి చేశారు.

## రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, మే 15, ప్రభాతవార్త:**

నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో గల లేక్ వ్యూ కాలనీలో శుక్రవారం రక్షిత మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైతే కొత్త బోర్లు ఏర్పాటు చేయడంతో పాటు ట్యాంకర్లద్వారాకూడా నీటిసరఫరా చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టు బడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శివ, ఇంజనీరింగ్ డీఈ వెంకటరమణ, కాలనీ అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్వాన్నంగా మారిన శిఖర్‌ఖానా రోడ్డు



అధ్వానంగా మారిన శిఖర్ ఖాన్ గ్రామానిని వెళ్లే రోడ్డు దృశ్యం

**నాగల్‌గిద్ద, మే 15, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని శిఖర్ ఖానాకు వెళ్లే రోడ్డు ఆధ్వానంగా మారింది. రోడ్డుపై కంకర తేలిపోవడంతో ఆటు గుండా వాహనాలపై ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని ప్రయాణీకులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణసంకటంగా మారిన రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని గ్రామస్థులు వినతి చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన చైర్మన్

**నాగల్‌గిద్ద, మే 15, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని షాపూర్ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శెట్కార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ నగేష్‌కుమార్ శెట్కార్ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తూ సొంతింటి కలను నెరవేరుస్తోందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన చైర్మన్ నగేష్‌కుమార్ శెట్కార్‌కు ఇంటి యజమానులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మహాలింగ పటేల్ ఉన్నారు.

## సురక్షనేత్రతో గ్రామభద్రత మరింత బలోపేతం

**-హుస్నాబాద్ ఏసీపీ సందారపు సదానందం**



సీసీ కెమెరాలాను పరిశీలిస్తున్న ఏసీపీ సదానందం

**అక్కన్నపేట, మే 15, ప్రభాతవార్త:**

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సిద్దిపేట సురక్ష నేత్ర" కార్యక్రమంలో భాగంగా అక్కన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌటకుంట తండా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలను హుస్నాబాద్ ఏసీపీ సదానందం శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ సదానందం మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ నాయకత్వంలో జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్న సురక్ష నేత్ర" ప్రాజెక్ట్ ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నా రు. ఈకార్యక్రమంలో అక్కన్నపేట ఎస్ఐ ప్రశాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కిషోర బాలికల సాధికారతపై అవగాహన

**గుమ్మడిదల, మే 15, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కిషోర బాలికల సంఘాల (స్నేహ) అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కిషోర బాలికల సంఘాల ఏర్పాటు, వాటి ప్రాముఖ్యతపై విస్తృతంగా చర్చించారు. ఇంకా సంఘాలు లేని ప్రాంతాల్లో కూడా కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో, ఐసీడీఎస్ ఏఎన్ఎమ్ శైలజ టీచర్, ఏపీఎం నరేందర్ కుమార్, సీసీలు భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, కృష్ణ, ఎంఎస్ కార్యదర్శి పూజ, వీవోఏలు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు

**-సీపీ సాధన రష్మీ పెరుమాళ్**



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు మూడోకన్నులా పనిచేస్తాయని నేరస్తులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని సీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. ప్రజలరక్షణ, నేరనియంత్రణ లక్ష్యంగా సీపీ ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన 'సిద్దిపేట సురక్ష నేత్ర' మూడో విడత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 26 పోలీసు స్టేషన్ల పరిధిలో 275 నూతన సీసీ కెమెరాలను ప్రారంభించారు. సిద్దిపేట త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పొన్నాల గ్రామంలో ఏర్పాటు చేసిన 16 సోలార్ సీసీ కెమెరాలు, రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని రాఘవాపూర్‌లో ఏర్పాటు చేసిన 19 కెమెరాలను సీపీ సాధన రష్మీ పెరుమాళ్ ప్రారంభించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సురక్ష నేత్ర కార్యక్రమం ద్వారా కాలనీలు, ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. తమ తమ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీఐలు విద్యాసాగర్, లక్ష్మీబాబు, ఎస్ఐలు, సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి

**-జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు**



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

**పాపన్నపేట, మే 15, ప్రభాతవార్త:**

నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, రాత్రి వేళల్లో పహారా నిర్వహణను కట్టుదిట్టం చేయాలని ఎస్పీ శ్రీనివాస్ రావు సూచించారు. శుక్రవారం పాపన్న పేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలల్లో నిఘా వ్యవస్థను బలోత్పం చేయాలనీ, రాత్రి వేళల్లో పహార కట్టుదిట్టం చేయాలనీ సూచించారు. ప్రజల్లో భద్రత్తభావం పెరిగేలా ప్రెండ్లి పోలీస్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయనవెంట డీసీఆర్బి ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

**-అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్**



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్

**కోహెడ, మే 15, ప్రభాతవార్త :**

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత చాలా కీలకమని అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ అన్నారు. మండల పరిధిలోని శనిగరం గ్రామంలో పంచాయతీ వద్ద వైట్ ఫీల్డ్ బయో ప్రొడక్ట్, గ్రీన్వేస్ బయో ఎనర్జీ కంపెనీల సహకారంతో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. అధు నిక సాంకేతికతను కలిగిన సీసీ కెమెరాలను గ్రామంలోని ప్రధాన వీధుల్లో, బస్‌స్టేషన్, గ్రామ ఎంట్రీ, ఎగ్జిట్‌లలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి నిషేధిత గంజాయి, రేషన్ బియ్యం అక్రమరవాణా జరగకుండా నియంత్రించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనుమనాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి సహకరించిన కంపెనీ ప్రతినిధులను అభినందించారు. కార్య క్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీను, ఎస్ఐ అభిలాష్, సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య, ఉప సర్పంచ్ పెరుక బుచ్చయ్య, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి పునరుద్దించాలి

**-ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య**

**-నర్సాపూర్ ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా**




ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఉపాధీ హామీ కూలీలు

**నర్సాపూర్, మే 15, ప్రభాతవార్త :**

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్యా డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నర్సాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీఓ వినతిపత్రం. అందజేశారు ఈ సందర్భంగా ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసింది. దీని స్థానంలో విబిజి రామ్ జి చట్టాన్ని తెచ్చి గతంలో 90 శాతం నిధులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం 60 శాతం మాత్రమే ఇస్తామని మరో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని నిర్ణయం చేసిందన్నారు. అంతేగాక పని దినాలను 125 రోజులకు పెంచినట్లే పెంచి వ్యవసాయ సీజన్ లో 60 రోజుల పనిని బంద్ చేస్తామని ప్రకటించిందన్నారు. వెంటనే ఉపాధిహామీకూలీల సమస్యలు పరిష్కరించా లని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె మల్లేశం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి, ఉపాధి కూలీలు గుమ్మడిదల శ్రీనివాస్, ఆంజనేయులు, యాదయ్యా, పి శ్రీనివాస్, సుగుణ, రంగయ్య, యాదమ్మ, మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల ఆగ్రహం

**-పండించిన ధాన్యాన్ని రోడ్డుపై పోసి రైతుల నిరసన.ధర్నా, రాస్తారోకో**



వినూత్న రీతిలో ధర్నా రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు తదితరులు

**నర్సాపూర్, మే 15, ప్రభాతవార్త :**

నర్సాపూర్ మండలంలో వరి ధాన్యం కొనుగోలు సక్రమంగా చేయడం లేక ఆలస్యం జరుగుతున్న నేపథ్యంలో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన ధర్నా ,రాస్తారోకో చేపట్టారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదంటూ ఆగ్రహించిన రైతన్నలు శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధాన్యం బస్తాలను రోడ్డుపై పోసి వినూత్న రీతిలో ధర్నా రాస్తారోకో చేపట్టి మానవ హారంతో నిరసన తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి నర్సాపూర్ మండల పరిధి లోని తుజాల్‌పూర్ ఆ చుట్టుపక్క గ్రామాల రైతులు ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలిస్తే కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని అదేవిధంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సైతం తీసుకెళ్లడానికి లారీలు కూడా రావడం లేదని ఆరోపించారు. దీంతో మిల్లర్లు ధాన్యాన్ని అన్లోడ్ చేయలేక వారం రోజులపాటు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నామని ఆగ్రహించిన రైతులు నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణానికి తరలివచ్చి నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో ధాన్యం రోడ్డుపై పోసి పెద్ద ఎత్తున ధర్నా రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ధర్నాతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోగా ట్రాఫిక్ స్పందించి పోయింది. సమాచారం తెలుసుకున్న నర్సాపూర్ ఎస్సై రంజిత్‌కుమార్ పోలీస్‌బలగాలతో రంగ ప్రవేశం చేసి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో రైతులకు పోలీసులకు వాగ్వి వివాదం జరిగింది సంబంధిత అధికారులు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తామని లారీలను కొనుగోలు కేంద్రానికి పంపిస్తామని హామీ ఇచ్చేవరకు ఈధర్నాను విరమించేదిలేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. ఈక్రమంలో స్పందించిన ఎస్ఐ రంజిత్ కుమార్ రైతులకు నచ్చజెప్పి మండల తాసిల్దార్ శ్రీనివాస్ ను రప్పించి ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమింపచేశారు. ధర్నాలో తుజాల్పూర్ గ్రామానికి చెందిన రైతులతో పాటు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు

## లైబ్రెరీ డే సందర్భంగా పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శిస్తున్న దృశ్యం

**కొల్చారం, మే 15, ప్రభాతవార్త:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్స వాల్లో ఐదవ రోజు సందర్భంగా స్థానిక మండల కేంద్రం కొల్చారం గ్రామంలోని గ్రంథాలయంలో లైబ్రెరీ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను స్థానిక సర్పంచ్ దేవన్న గారి శేఖర్ మండల విద్యాధికారి ఉమారాణి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల విజ్ఞాన, సాహిత్య, చరిత్ర, శాస్త్ర సాంకేతిక, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ప్రదర్శనలో ఉంచగా విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవడంతో పాటు వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమం లో జడ్పీహెచ్ఎస్ హెచ్.ఎం రేవతి దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులకు పుస్తక పఠనం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

## గ్రంథాలయాల ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**-ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సమీరా నజ్నీన్**

**నర్సాపూర్ మే 15, ప్రభాతవార్త :**

విద్యార్థులు గ్రంథాలయాల ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సమీరా నజ్మీన్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోతెలంగాణ ప్రభ్నుత్వ ప్రతిష్మాత్మక చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్స వాల కార్యక్రమాల్లో భాగంగా 5 వ రోజు గ్రంథాలయ దినోత్స వంను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. హుస్సేన్ మార్గదర్శకత్వంలో, వైస్ ప్రిన్సిపాల్ సమీరా నాజ్నీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించి ఇందులో వివిధ అంశాలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, సాహిత్య గ్రంథాలు, విజ్ఞాన సర్వస్వాలు మరియు ప్రేరణాత్మక పుస్తకాలను ప్రదర్శించారు. విద్యార్థులుఈ పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించి పఠించారు కార్యక్రమంలో అధ్యాపకులు డా. ఆదెప్ప, డా. రమేష్, డా. ఎం.డి. ఖాజా ఆరిఫ్, డా. అనిత, డా. బి. సురేష్ కుమార్, శ్రీనివాస్, హేమంత్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రొమ్ము క్యాన్సర్ ఉచిత పరీక్ష శిబిరం

**గుమ్మడిదల, మే 15, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో రొమ్ము క్యాన్సర్ ఉచిత పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏఐజి హాస్పిటల్ తెలంగాణ ప్రభుత్వం గ్రానివెల్స్ పరిశ్రమ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. అలాగే డాక్టర్ ఎస్ మధుకర్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కత్తుల రమేష్, విజయలక్ష్మి, జైపాల్ రెడ్డి, సురభి కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకులు పొన్నాల శ్రీను, చప్పటి మహేశ్ హాజరయ్యారు. హెచ్ఈఓ శ్రీనివాస్, ఏఎన్ ఎం శశికళ, మణెమ్మతో పాటు ఆశా కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. తదుపరి రొమ్ము క్యాన్సర్ ఉచిత పరీక్ష శిబిరాన్ని మే 19న వార్డు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సన్మానం అందుకున్న వైద్య విద్యార్థిని సావిత్రి



వైద్య విద్యార్థిని సావిత్రిని సన్మానిస్తున్న దృశ్యం

**మొగుడంపల్లి, మే 15, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని విట్టునాయక్ తండాకు చెందిన గోపాల్ రాథోడ్ తనయ సావిత్రి ఎంబీబీఎస్‌లో సీటు సాధించి తండా వాసులతో సన్మానం అందుకుని అభినందనలు పొందారు. ఎంబీబీఎస్‌లో సాటు సాధించిన సావిత్రిని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పట్లోళ్ల విజయ మోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించి మిఠాయితో నోటిని తీపి చేసి శుభాకాంక్షలు తెలిపారు. సావిత్రిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పి విజయమోహన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో బిజెపి సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, నాయకులు రూప్‌సింగ్ రాథోడ్, జగన్, నవీన్, మధు, తుకారాం, గోపాల్, భీమసింగ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ వివాహ జంటకు పోలీసుల కౌన్సిలింగ్

**-ఎస్ఐ చొరవతో కలిసిన దంపతులు**



భార్యభర్తలకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ దామోదర్

**మర్కుక్, మే 15 (ప్రభాతవార్త):**

ప్రేమించి పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్న జంట మధ్య నెలకొన్న విభేదాలు పోలీసుల చొరవతో సద్దుమణిగాయి. భార్య భర్త ఇంటి ఎదుట రెండు రోజులుగా నిరసన చేపట్టిన ఘటనకు మర్కుక్ పోలీసులు కౌన్సిలింగ్ ద్వారా ముగింపు పలికారు. మండలంలోని పాతూరు గ్రామానికి చెందిన అభిలాష్‌రెడ్డి, గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామానికి చెందిన గౌరిలు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యులను ఎదిరించి పెళ్లి చేసుకున్న వీరు హైద్రాబాద్‌లో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ప్రస్తుతం తొమ్మిది నెలల బాబు ఉన్నాడు. అయితే కొన్ని నెలలుగా దాంపత్య జీవితంలో విభేదాలు తలెత్తినట్లు సమాచారం. కుటుంబసభ్యుల మాటలు విన్న అభిలాష్‌రెడ్డి తన భార్య గౌరిని ఆమె తల్లిగారి ఇంటి వద్ద వదిలి దూరంగా ఉంటున్నాడని ఆరోపణలు వచ్చాయి. దీంతో గౌరి గత రెండు రోజులుగా పాతూరు గ్రామంలోని భర్త అభిలాష్‌రెడ్డి ఇంటి ముందు నిరసన చేపట్టింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, మీడియాలో కూడా విస్తృత ప్రచారం జరిగింది. విషయం తెలుసుకున్న మర్కుక్ ఎస్ఐ దామోదర్ జోక్యం చేసుకుని భార్యాభర్తలకు, వారి కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. దాంపత్య జీవితంలో చిన్నచిన్న విభేదాలు సహజమని, పరస్పరం అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఇరు కుటుంబాల సమక్షంలో భార్యాభర్తలను కలిపి పంపించారు. దీంతో రెండు రోజులుగా కొనసాగిన ఉద్రిక్తతకు తెరపడింది.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**-జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి**

**గజ్వేల్, మే 15 (ప్రభాతవార్త):**

పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10 లక్షల ఆర్థిక సహాయం, నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో కేవలం మాటలు తప్ప అభివృద్ధి జరగలేదని గత ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, సుఖేందర్‌రెడ్డి, ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, జాకీర్, కొండల్‌రెడ్డి, సబ్బని నరేష్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని సందర్శించిన చైర్మన్

**వెల్దుర్తి, మే 15, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన వెల్దుర్తిలో నీ గ్రంథాలయాన్ని శుక్రవారం నాడు గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి సందర్శించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలు భాగంగా లైబ్రరీని సందర్శించడం జరిగిందని ఆమె తెలిపారు. లైబ్రరీలో ఉన్న పుస్తకాలను పాఠకులు సద్విని చేసుకోవాలని ఆమె తెలిపారు. జనరల్ నాలెడ్జ్. గ్రూప్ ఫోర్త్. ఇతర సభ్యులకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వియం చేసుకోవాలన్నారు. ఇంకా ఏమైనా పుస్తకాలు అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని. సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ స్వామి. పిఎసిఎస్ డైరెక్టర్ కృష్ణ గౌడ్. గ్రామ సర్పంచ్ ఆదర్శ్. ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్. బిజెపి నాయకుడు శ్రీనివాస్ గౌడ్. ముక్తా బాయ్. తదితరులు పాల్గొన్నారు.

## 350 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**చౌటకూరు, మే 15, ప్రభాతవార్త:**



రేషన్ బియ్యం కంటైనరర్‌ను పట్టుకున్న పోలీసులు

అక్రమంగా 350 క్వింటాళ్ల రేషన్ బియ్యంను తరలిస్తున్న లారీని మండల పరిధిలోని తాడ్దానిపల్లి టోల్ ప్లాజా వద్ద 161వ జాతీయ రహదారిపై కంటైనర్ (జీజే 06బీవై 4036) వాహనాన్ని పోలీసులు గురువారం సాయంత్రం పట్టుకున్నా రు. హైద్రాబాద్ నుంచి రాయచూర్ కు వెళుతున్న కంటైనర్‌ను స్పెషల్ బ్రాంచి పోలీసులు టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహిస్తూ పట్టుకున్నారు. 350 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో వెళుతున్న కంటైనర్‌ను పట్టుకున్నట్లు ఎస్ విశ్వజాన్ పేర్కొన్నారు. అక్రమంగా తరలుతున్న బియ్యం పట్టుకున్నట్లు జిల్లా పౌరసరఫరరాల శాఖ అధికారులకు సమాచారం అందించాలని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వజన్ వివరించారు.

## ఎండిపోయిన పల్లె ప్రకృతి వనం



జంగి (కే)లో ఎండిపోయిన పల్లె ప్రకృతి వనం దృశ్యం

**కంగ్టి, మే 15, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని జంగి(కే) గ్రామంలోని పల్లె ప్రకృతి వనంను పట్టించుకునే వారు కరువవడంతో ప్రకృతి వనంలో పచ్చదం కానరాక ఎండిపోతోంది. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండలంలోని ప్రతి పంచాయితీలో ప్రకృతి వనంను ఏర్పాటు చేసి పలు రకాల మొక్కలు, పండ్ల చెట్లను ఏర్పాటు చేయించింది. ప్రకృతి వనంలో పెంచిన మొక్కలు ఏపుగా పెరగడంతో గ్రామానికి చెందిన వారు చెట్లను వంట చెరుకుగా నరికేస్తున్నా అడిగే నాథులు కరువయ్యారు. కొందరు అక్రమార్కులు పల్లె ప్రకృతిని కబ్జా చేసినట్లు ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనంను కబ్జా కోరాల్లో నుంచి విముక్తి కల్గించడంతో పాటు వనంలో మొక్కలు, చెట్లు పచ్చగా ఉండేలా చర్యలు తీసుకోవాని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## సిసి కెమెరాలతో భద్రతాభావం పెరుగుతుంది

**-తొగుట సిఐ ఎస్‌కె.లతీఫ్**

**రాయపోల్, మే 15 (ప్రభాతవార్త):**

గ్రామాలలో సిసి కెమెరాల ఏర్పాటుతో ప్రజలలో భద్రతాభావం పెరుగుతుందని తొగుట సిఐ ఎస్‌కె.లతీఫ్ అన్నారు. సిద్దిపేట సురక్ష నేత్రం కార్యక్రమంలో భాగంగా రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన ఎనిమిది సిసి కెమెరాలను శుక్రవారం రాయపోల్ ఎస్ఐ కె.మానస, గ్రామ సర్పంచ్ శ్యామల మల్లేశంలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ లతీఫ్ మాట్లాడుతూ గ్రామాల్లో సిసి కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణకు తోడ్పాటుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, పంచాయతీ కార్యదర్శి పరమేశ్వర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సిసి కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చు

## -ట్రైనీ ఐపిఎస్ అధికారిణి ఆయేషా ఫాతిమా

**కొండపాక, మే 15, ప్రభాతవార్త:**
సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చునని ట్రైనీ ఐపిఎస్ అధికారిణి, కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ ఇంచార్జి ఎస్సై ఆయేషా ఫాతిమా అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి మండలపరిధిలోని మాత్‌పల్లి గ్రామంలో సర్పంచ్ బచ్చలి శ్రీలతతో కలిసి 8 సిసి కెమెరాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. సిసి కెమెరాల ఏర్పాటువల్ల దొంగతనాలతోపాటు నేరాలను సైతం నియంత్రించవచ్చునని తెలిపారు. ప్రతి గ్రామంలోను, దుకాణాల్లో సిసి కెమెరాలను తప్పకుండా ఏర్పాటుచేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో తొగుట సిఐ లతీఫ్, గజ్వేల్ ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, మాజీసర్పంచ్ బచ్చలిమహిపాల్, ఉపసర్పంచ్ లింగం, కార్యదర్శి రాజేష్, వార్డు సభ్యులు, కొక్కొండ కృష్ణ, మర్కుక్ నర్సింలు, పోచమైన నర్సింలు, జుట్టు కృష్ణవేణి, రుద్రమ్ లావణ్య, బోనాల అనిత, సిరివేరి నవనీత, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


సిసి కెమెరాల ప్రారంభం తర్వాత మాట్లాడుతున్న ట్రైనీ ఐపిఎస్ అధికారిణి ఆయేషా

## పఠనాసక్తి పెంచడమే లక్ష్యం
### -అల్లాదుర్గం సర్పంచ్ మద్దూరి సౌమ్య


గ్రంథాలయంలో జ్యోతిప్రజ్వలనం చేస్తున్న సర్పంచ్ మద్దూరి సౌమ్య

**అల్లాదుర్గం, మే 15, ప్రభాతవార్త:**
ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక కార్యక్రమంలోభాగంగా విద్యావారోత్సవాలను పురస్కరించుకుని మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని గ్రంథాలయంలో శుక్రవారం విద్యావారోత్సవాల సందర్భంగా ప్రత్యేక పుస్తకప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి లక్ష్మణ్, సర్పంచ్ మద్దూరి సౌమ్య, మండల సర్పంచ్‌లఫోరం అధ్యక్షులు నరసింహారెడ్డిలు మాట్లాడుతూ గ్రంథాలయంలో అనేకరకాల పుస్తకాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో యువతకు, రైతులకు, వ్యాయామానికి, పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సారిక, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, లైబ్రేరియన్ సుజాత, నాయకులు సురేష్‌గౌడ్, దశరథ్, బాలరాజ్ తదితరులు ఉన్నారు.

## సర్కారు బడితోనే పఠనాసక్తి

**సిర్గాపూర్, మే 15, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులతోకలిసి గ్రామంలోవీధులగుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఈఓ నాగారం శ్రీనివాస్ అన్నారు. తల్లిదండ్రుల తమ చిన్నారుల బంగారుభవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందుకునేలా ప్రత్యేకచొరవ తీసుకోవాలని ఎంఈఓ శ్రీనివాస్ తల్లిదండ్రులకు సూచించారు.

## కడపల్‌లో ఆకట్టుకున్న కుస్తీ పోటీలు


కడపల్‌లో మల్లయోధులు కుస్తీ పోటీలు పడుతున్న దృశ్యం

**సిర్గాపూర్, మే 15, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కడపల్‌లో కుస్తీ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. కుస్తీ పోటీలను తిలకించేందుకు గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల నుంచి మల్లయోధులు తరలివచ్చి పోటీల్లో తమసత్తా చాటుకున్నారు. కుస్తీ పోటీల్లో ప్రతిభచాటిన మల్లయోధులకు బహుమతులు అందచేశారు.

## నూతన అధ్యక్షునికి ఘన సత్కారం


మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిని సత్కరిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, మే 15, ప్రభాతవార్త:**
బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా పదవీబాధ్యతలు చేపట్టిన లింగాల శ్రీనివాస్ శుక్రవారం ఎమ్మెల్యే, టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా హైదారాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నూతన అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, రత్నాకర్‌రెడ్డి, కర్రావుల సందీప్, జెల్ల ప్రభాకర్, బైర సంతోష్, శానకొండ శరత్, రావుల నర్సయ్య, బొనగం రమేష్, సంపత్‌రెడ్డి, ఐలయ్య, బోనగిరి ప్రభాకర్, బోనగిరి శ్రీనివాస్, జంగిటి శంకర్ పాల్గొన్నారు.

## గృహప్రవేశాలతో లబ్ధిదారుల్లో ఆనందం
### -టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి


ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నిర్మలాజగ్గారెడ్డి

**సదాశివపేట, మే 15, ప్రభాతవార్త:**
సదాశివపేట మండలంలోని బాబిలిగామ, ఆత్మకూర్ గ్రామాలలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈకార్యక్రమాలకు టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్దన్న, సేవాదళ్ అధ్యక్షుడు సందీప్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, సర్పంచ్ నికిత బింబాదర్‌చారి, ఉపసర్పంచ్ అశోక్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ యూసుఫ్, బాబిలిగామ మాజీసర్పంచ్ గోపాల్, సొసైటీచైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మండల నాయకులు మాణిక్‌రెడ్డి, నర్సింలు, రాజు, చింటూగౌడ్, బసవరాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడం పట్ల ఆనందం వ్యక్తంచేశారు.

## జ్ఞానాభివృద్ధికి గ్రంథాలయాలు కీలకం
### -జెఎన్టీయు ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.విశ్వనాథరాజు

**చౌటకూరు, మే 15, ప్రభాతవార్త:**
విద్యార్థుల జ్ఞానాభివృద్ధికి గ్రంథాలయాలు అత్యంతకీలకమని, సంప్రదాయ పుస్తకాలతోపాటు డిజిటల్ లైబ్రరీ సేవలను మరింతగా విస్తరించనున్నట్లు సుల్తాన్‌పూర్ జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథరాజు తెలిపారు. ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న విద్యావారోత్సవాల్లో భాగంగా గురువారం కళాశాలలో గ్రంథాలయ అభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక విద్యా అవసరాలకు అనుగుణంగా డిజిటల్ లైబ్రరీలను బలోపేతంచేయడంద్వారా విద్యార్థులకు ప్రపంచస్థాయి అధ్యయన వనరులు అందుబాటులోకి వస్తాయన్నారు. అంతకుముందు ప్రిన్సిపాల్ గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాల విభాగాలను పరిశీలించారు. విద్యార్థులకు ఆధునిక విద్యావనరులు అందుబాటులో ఉండేలా గ్రంథాలయంలో కొత్త పుస్తకాల సమీకరణ, డిజిటల్ లైబ్రరీ విస్తరణ, ఈ లెర్నింగ్ సదుపాయాల మెరుగుదలపై పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ వై.రాఘవేందర్‌రావు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంప్‌తో చిన్నారుల్లో ఉత్సాహం


జడ్పిహెచ్ఎస్‌లో సమ్మర్ క్యాంప్ కొనసాగుతున్న దృశ్యం

**సిర్గాపూర్, మే 15, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. క్యాంప్‌లో విద్యార్థులు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. శిక్షకుల ఆధ్వర్యంలో బొమ్మలుగీయడం, పేపర్‌కటింగ్‌తో రకరకాల వస్తువుల తయారీల్లో చిన్నారులు నిమగ్నమయ్యారు. పాఠశాలలో కొనసాగుతున్న క్యాంప్‌ను ఎంఈఓ నాగారం శ్రీనివాస్ సందర్శించి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. సమ్మర్ క్యాంప్‌లు చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచుతాయని ఎంఈఓ నాగారం శ్రీనివాస్ కొనియాడారు.

## ఉపాధిహామీ పనులు, కొనుగోలుకేంద్రాల పరిశీలన


అధికారులకు,సిబ్బందికి సూచనలు చేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, మే 15, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని గౌరాయిపల్లి, రాంసాగర్, రసూలాబాద్ గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం(ఈజిఎస్) పనులు, ధాన్యం కొనుగోలుకేంద్రాలను డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్య శుక్రవారం పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ప్రత్యేక్షంగా పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో చేపడుతున్న ఈజిఎస్ పనుల నాణ్యత, కార్మికులకు అందుతున్న సౌకర్యాలు, పనులవేగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలు, సేకరణ ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలుకేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగుచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడివో, సర్పంచ్‌లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ఔషధ విక్రయాలను నిలిపివేయాలి
### -హుస్నాబాద్ కెమిస్ట్ అసోసియేషన్


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, మే 15, ప్రభాతవార్త:**
ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఔషధ విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త మెడికల్ షాపుల బంద్‌కు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని హుస్నాబాద్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బింగి శ్రీనివాస్, కార్యదర్శి ముంజ రమేష్, కోశాధికారి రావుల రంజిత్ శుక్రవారం హుస్నాబాద్ ఆర్డీఓ, ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దాసరి వినోద్, జిల్లా ఉపాధ్యక్షులు ఐత శ్రీధర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కనుకుంట్ల శ్రీనివాస్, సభ్యులు బండి ధనుంజయ్, వేముల మహేష్, బింగి వెంకటరమణ, బండారి దినేష్, నూక వంశీ, తాళ్లపల్లి నరేష్ పాల్గొన్నారు.

## ఉద్యమ పితామహుల జయంతి ఉత్సవాలు

**చౌటకూరు, మే 15, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన చౌటకూరులో ఈ నెల 17వ తారీఖున బహుజన తాత్త్విక ఉద్యమ పితామహులు మహాత్మ జ్యోతిరావుపూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావుల జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆహ్వానకమిటీ సభ్యులు దాసరి ప్రేమ్‌కుమార్ తెలిపారు. 17న సాయంత్రం 5గంటలకు స్థానిక అంబేద్కర్ విగ్రహంవద్ద దేవార్జున అధ్యక్షతన ఉత్సవాలు జరుపుతామన్నారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయవాది, బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షులు కదిరె కృష్ణ, విశిష్ట అతిథులుగా విశ్వజన కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు మాస్టారీ, రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనంతయ్య, సర్పంచ్ పార్కల రాంరెడ్డిలు హాజరవుతున్నారన్నారు. సాయంత్రం గ్రామంలో ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. మాస్టారీ బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రజాస్వామ్యవాదులు, అంబేద్కర్ సంఘాల నాయకులు, మేధావులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ప్రేమ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

## తండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి
### -గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు


వార్షికోత్సవ వేడుకలు జరుపుకుంటున్న గిరిజనులు

**చౌటకూరు, మే 15, ప్రభాతవార్త:**
గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేకంగా తండా బోర్డును ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్ అన్నారు. మండలపరిధిలోని బొమ్మారెడ్డిగూడంలో ఏర్పాటుచేసిన గిరిజన సంక్షేమ సంఘం 17వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా జైపాల్‌నాయక్ మాట్లాడుతూ తండాల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక నిధులుకేటాయించాలని కోరారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని దేశవ్యాప్తంగా సెలవుదినంగా ప్రకటించాలన్నారు. రామవ్ మహారాజ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని జైపాల్‌నాయక్ డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్‌నాయక్, గణపతినాయక్, హరిచంద్, మూడ్ విగేష్, బద్రీనాథ్, మూడ్ లక్ష్మణ్, పూన్యనాయక్, సంతోష్, పాండు, ఖుబ్యానాయక్, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించండి
### -ఎఐటియుసి నాయకులు


డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎఐటియుసి నాయకులు

**రామచంద్రాపురం, మే 15, ప్రభాతవార్త:**
గ్రామ పంచాయతీ సెంట్రల్ ఫండ్ నిధుల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినట్లు డిప్యూటీ కమిషనర్ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఎఐటియుసి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌కు వినతిపత్రం అందచేశారు. వినతిపత్రం అందుకున్న డిప్యూటీ కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ డిపిఓలతో సమావేశం అయి పెండింగ్ వేతనాలు ఇప్పిస్తామని హామీచేశారు. పిఎఫ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవులు, పండగ సెలవులు సైతం ఇచ్చేలా డిపిఓలకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలు త్వరలోనే పంచాయతీరాజ్ మినిస్టర్, రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కారం అయ్యేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుగూరి నరసింహారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటరాజం, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పిట్టల మల్లయ్య, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, శివశంకర్, షరీఫ్, బద్దె నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ సమావేశం బహిష్కరించిన సభ్యులు



గ్రామపంచాయతీ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు సభ్యులు

**పెద్దశంకరంపేట, మే 15, ప్రభాతవార్త:**
స్థానిక గ్రామపంచాయతీలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని వార్డుసభ్యులు బహిష్కరించారు. ఈసందర్భంగా ఉపసర్పంచ్ రాజుగౌడ్ మాట్లాడుతూ గతనెలలో నిర్వహించిన సమావేశంలో తాను సర్పంచిని దూషించినట్లు అసత్యప్రచారం చేయడంతోపాటు వేధించినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేయడం. గ్రామపంచాయతీ ముందు ఆందోళన నిర్వహించడాన్ని నిరసిస్తూ వార్డుసభ్యులందరూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామన్నారు. తమకు ఎలాంటిసమాచారం ఇవ్వకుండా ఆయావార్డులలో పనులు నిర్వహించడంపై వార్డుసభ్యులు అభ్యతరం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు శాంతమ్మ, నాగమణి, కవిత, ఆఫ్రోజ్, బి.రాజు, ఖలీమ్, రజినీకాంత్, రామకృష్ణాగౌడ్, రఫీఖ్ తదితరులున్నారు.

## అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో మాసశివరాత్రి పూజలు
### -ఘనంగా శివపార్వతుల కళ్యాణం


ఆలయంలో శ్రీశివపార్వతుల కళ్యాణం జరిపిస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, మే 15, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలోని శ్రీఅన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా విశేషపూజలు నిర్వహించడంతోపాటు శివపార్వతుల కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీచైర్మన్ జగ్గయ్యగారి శ్రీనివాస్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మన్నాపూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

**మొగుడంపల్లి, మే 15, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మన్నాపూర్‌లో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాల్‌కల్ మండలంలోని బసంత్‌పూర్ గ్రామ శివారులోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ కమలాకర్, డాక్టర్ వెంకటేష్‌లు రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్ ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలపై రైతులకు సమాచారం అందచేశారు. కార్యక్రమంలో ఎఈఓ భూమేష్, సర్పంచ్ రుక్కిబాయిహరిసింగ్, ఇప్పపల్లి సొసైటీచైర్మన్ హరిసింగ్, గ్రామస్థులు సుభాష్, ఆశన్న, అశోక్‌రెడ్డి, దశరథ్, ప్రభు, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో ఎడ్యుకేషన్ వీక్ ఉత్సవాలు
### -పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన కౌన్సిలర్ నాగరాజు


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ గజవాడ నాగరాజు

**రామాయంపేట, మే 14, ప్రభాతవార్త:**
ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రామాయంపేట మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న ఎడ్యుకేషన్ వీక్ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నాడు లైబ్రరీ డే సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు ప్రారంభించారు. మే 11 నుంచి 17వ తేదీ వరకు ఎడ్యుకేషన్ వీక్ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయ లైబ్రేరియన్ ఎం.శంకర్ తెలిపారు. ప్రదర్శనలో వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను ఉంచారు. విద్యార్థులు, యువత పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు. వారోత్సవాల్లో భాగంగా రానున్న రోజుల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు కూడా నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు, ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విద్యాభాండాగారాలు


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న సర్పంచ్ పావని నరేందర్‌గౌడ్

**పాపన్నపేట, మే 15, ప్రభాతవార్త:**
గ్రంథాలయాలు విద్యాభాండాగారాలని పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని పాపన్నపేట గ్రంథాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఐదవరోజు విద్యావారోత్సవాల్లో పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు నరేందర్‌గౌడ్, మండలవిద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, నాయకులు ఖలీం, రాములు, శ్రీను గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత పాల్గొన్నారు.

# కౌలు రైతులను గుర్తించాలి

## -డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్


మాట్లాడుతున్న డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

**గజ్వేల్ టౌన్, మే 15, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులను గుర్తించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ మండలం కొల్గూర్, పిడిచెడ్ గ్రామాల్లో కౌలు రైతుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ 2011 కౌలు రైతుల చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తించి ఎల్ఈసి కార్డులను మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులకు రైతు భరోసాను అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిసిసి అధ్యక్షుడి హోదాలో అప్పటి ప్రభుత్వానికి కౌలు రైతులకు రైతుభరోసా నష్టపరిహారం చెల్లించాలని ఉత్తరం రాశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కౌలురైతులకు రైతుభరోసా పంట నష్టపరిహారం, వ్యవసాయ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి మూడేళ్ల పాలనలో కైలు రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించలేదని ఆరోపించారు. కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించకపోవడంతో పంట నష్టపోయిన సమయంలో పరిహారం అందక కౌలు రైతులు మరింత అప్పులపాలవుతున్నారని, ఇకనైనా రాష్ట్రప్రభుత్వం కౌలు రైతుల సంక్షేమంకోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, మైసయ్య పాల్గొన్నారు.